సాక్షి సిద్దిపేట

గురువారం : 11 : ఏప్రిల్ : 2024



గుట్టుగా బెట్టింగ్

శ్రమ లేకుండా తక్కువ సమయంలో లక్షాధికారులు కావాలన్న అత్యాశకు పోయి యువత క్రికెట్ బెట్టింగ్ మోజులో పడుతున్నారు.

వివరాలు 8లో ▸



చెట్టును ఢీకొన్న కారు

కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందగా, మరో యువకుడికి గాయాలు అయ్యాయి.

వివరాలు 8లో ▸




ఆగుతూ.. సాగుతూ..

అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. స్థానిక నాయకత్వ లోపం కారణంగా రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు



హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగ సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను ముస్లింలు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిపే అతి పెద్ద పండుగల్లో రంజాన్ ఒకటని అన్నారు. చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని, ఈ పవిత్ర మాసం దీక్షలు, ప్రేమ, దయా గుణాలను పంచుతుందన్నారు.

మిరుదొడ్డి ఎంపీపీపై నాన్ బెయిలబుల్ వారెంట్

మిరుదొడ్డి(దుబ్బాక): ఓ మహిళను బంధించి, అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో మిరుదొడ్డి ఎంపీపీ గజ్జెల సాయిలుపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందని ఎస్‌ఐ పరశురామ్ బుధవారం తెలిపారు. 2000లో సదరు మహిళ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా కోర్టుకు నిర్దేశిత సమయంలో హాజరు కాకపోవడంతో కోర్టు ధిక్కారం కింద ఎంపీపీ సాయిలుకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సాయిలు బుధవారం సిద్దిపేట కోర్టుకు హాజరై ముందస్తు నాన్‌బెయిలబుల్ వారెంట్‌పై పిటిషన్ వేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో నర్సారెడ్డి


ములుగు(గజ్వేల్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. బుధవారం జప్తిసింగాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పలువురు నర్సారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. వారందరికీ నర్సారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ముఖ్యమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నీలం ప్రభాకర్‌రెడ్డి, నర్సయ్య, కిశోర్, కుమార్, సత్తయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తమ్మలి శ్రీనివాస్, ఏకాంబర్‌రెడ్డి, కాంతారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి హామీ

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ చొరవతో భూ సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైంది. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రియాంక గాంధీ స్థానికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. కిషన్‌నగర్‌లో జాగిరి రమ ఇంటికి వెళ్లి బాగోగులు అడిగారు. వారికి ఫోన్ నంబర్ ఇచ్చి సమస్యలు ఉంటే తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తమకు భూమి సమస్య ఉందని వారం క్రితం ప్రియాంక గాంధీకి మెస్సేజ్ చేయగా, దానిని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పంపారు. మంగళవారం మంత్రి కిషన్‌నగర్‌లోని బాధితుల ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డి రమ ఇంటికి వెళ్లి భూమి పత్రాలు ఇస్తే వాటిని పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎండోమెంట్ ఈఓపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): ఎండోమెంట్ ఈఓపై అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి బెజ్జంకి నాయకులు ఫిర్యాదు చేసిన ఘటన చోటుచేసుకుంది. బెజ్జంకిలోని లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణలో రాజకీయ నేతల జోక్యాన్ని అరికట్టడంలో ఎండోమెంట్ ఈఓ విశ్వనాథ శర్మ విఫలమయ్యారని వారు ఆరోపించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరుతూ బెజ్జంకి నాయకులు లింగాల లక్ష్మన్, గుబిరె మల్లేశం, నరేష్, మహేష్ తదితరులు బుధవారం ఫిర్యాదు చేశారు.



నింగిలో నెలవంక..



సిద్దిపేటలోని ఈద్గా వద్ద ఏర్పాట్లు

కనిపించిన నెలవంక

- నేడే రంజాన్ పర్వదినం
- ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంజాన్ నెలవంక బుధవారం కనిపించింది. గురువారం రంజాన్ పండుగ నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలోని మసీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నమాజ్ చేసుకునేందుకు వీలుగా స్థలాన్ని చదును చేశారు. అలాగే వేసవికాలం దృష్ట్యా ఎండ తగలకుండా శామియానాలు, తాగునీరు తదితర ఏర్పాట్లు చేశారు.

జోరుగా రేషన్ దందా

జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. ఈ నెల ఒకటి నుంచి 9వ తేదీ వరకు 219 క్వింటాళ్ల రేషన్ బియ్యం సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. నిత్యం వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం సరిహద్దులు దాటిస్తుండటం గమనార్హం. ఈ దందాలో ముగ్గురు వ్యక్తులు కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.



స్వాధీనం చేసుకున్న బియ్యం వాహనం

- లబ్ధిదారుల నుంచి తిరిగి బియ్యం కొనుగోలు
- గుట్టుగా సరిహద్దులకు తరలిస్తున్న దళారులు
- కర్ణాటక, రైస్ మిల్లు, కోళ్ల దాణాకు సరఫరా
- దందాలో ముగ్గురు వ్యక్తులది కీలక పాత్ర
- అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు

సాక్షి, సిద్దిపేట: పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం రేషన్ షాప్‌ల ద్వారా ఉచితంగా బియ్యం సరఫరా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2,91,425 రేషన్ కార్డులు, అంత్యోదయ కార్డులు 18,378, ఆహార భద్రత కార్డులు 2,72,965, అన్నపూర్ణ కార్డులు 82 ఉన్నాయి. ఈ కార్డులకు ప్రతి నెలా 5,711 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. లబ్ధిదారులు రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకురాగానే దళారులు ఇంటి ఎదుట వాలిపోతున్నారు. కిలో బియ్యం రూ.10ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అయిదారు క్వింటాళ్ల సేకరించిన తర్వాత బియ్యం ఓ ఆటోలో తరలిస్తున్నారు. సిద్దిపేట పరిసర ప్రాంతాలైన కరీంనగర్ రోడ్, శరబేశ్వరాలయం, సిరిసిల్ల రోడ్, చేర్యాల, కొమురవెల్లి, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాకలలో గ్రామ శివార్లకు ఆటోలు చేరుకోగానే డీసీఎం, లారీ అక్కడికి రాత్రి సమయాల్లో చేరుకుంటుంది. ఈ ఆటోలలో ఉన్న బియ్యం పెద్ద వాహనాల్లో డంప్ చేస్తున్నారు. ఈ దందా ప్రతి నెలా 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సాగుతోంది. జిల్లా నుంచి కర్ణాటకకు, రైస్ మిల్లులు, కోళ్ల ఫారాలకు తరలిస్తున్నారు.

ప్రతి నెలా రూ.2కోట్లపైనే..

రేషన్ బియ్యం దందాల్లో రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఇందులో దాదాపు 50శాతం వరకు బయట విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కార్డు దారుల నుంచి కిలో బియ్యం రూ.10లకు కొనుగోలు చేసి రూ.20 లకు బయట విక్రయిస్తున్నారు. ఇలా సుమారుగా ప్రతి నెలా రూ.2కోట్ల వరకు లావాదేవీలు జరుపుతున్నట్లు సమాచారం.

ఆ ముగ్గురి చేతుల్లోనే..

జిల్లాలో రేషన్ బియ్యం దందా మూగ్గురు చేతుల్లో కొనసాగుతున్నట్లు చర్చసాగుతోంది. ఒకరేమో గుట్టు చప్పుడుకాకుండా 'అశోక చక్రం' వలే చక్రం తిప్పుతున్నాడు. మరొకరు రేషన్ బియ్యం యథేచ్ఛగా సాగిస్తూ 'శాశి'స్తున్నారు. మరోవ్యక్తి తన 'పరపతి'తో అండగా నిలుస్తున్నారు. ఈ ముగ్గురు అక్రమ వ్యాపారులకు అండగా నిలుస్తున్నట్లు సమాచారం. వీరికి క్షేత్ర స్థాయిలో అధికారులు సహకరిస్తుండటంతో దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు గుర్తించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

నిఘా పెడుతున్నాం



రేషన్ బియ్యం అక్రమ రవాణా పై కట్టుదిట్టమైన నిఘా పెట్టుతున్నాం. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి బియ్యంను స్వాధీనం చేసుకుంటున్నాం. అక్రమ సరఫరా చేస్తున్న వారిపై 6(ఏ) కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం.

– తనూజ, డీఎస్ఓ

రేషన్ బియ్యం పట్టివేత

మూడు వాహనాలు సీజ్, ముగ్గురి అరెస్టు

రాయపోలు(దుబ్బాక): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు రాయపోలు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాయపోలు మండలం వడ్డేపల్లి సమీపంలో అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు మంగళవారం సాయంత్రం ఆ ప్రాంతంలో నిఘా పెట్టారు. అంకిరెడ్డిపల్లి సమీపంలో రెండు వాహనాలు, వడ్డేపల్లి సమీపంలో ఓ ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన వదవత్ నామ్, మాలోత్ నితిన్, బుక్య రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వాహనాలలో సుమారు 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాహనాలను సీజ్ చేశారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

అలయన్స్ క్లబ్ కమిటీ నేడు ప్రమాణ స్వీకారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ప్రమాణస్వీకారం గురువారం నిర్వహించనున్నట్లు అలయన్స్ క్లబ్ ప్రతినిధి ఆత్మ రాములు తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటలకు వైశ్య భ వన్ లో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల క్రితం అలయన్స్ క్లబ్ జిల్లాలో ఏర్పాటైందన్నారు. నిరుపేదలకు, పేద విద్యార్థులకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.



చిరుతపులిని చంపిన ఘటనలో నిందితులను అరెస్టు చూపిస్తున్న ఫారెస్టు అధికారులు

చిరుతపులిని చంపిన కేసులో నలుగురి అరెస్టు

దుబ్బాక: దౌల్తాబాద్ శివారులోని అటవీప్రాంతంలో చిరుతపులిని చంపి, దహనం చేసిన సంఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జిల్లా అటవీశాఖ అధికారి కొత్తపల్లి శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. నెలరోజుల క్రితం దౌల్తాబాద్-చేగుంట అడవిలో వేటగాళ్ల ఉచ్చులో చిరుతపులి పడింది. అయితే నిందితులు పులిని చంపి కళేబారాన్ని దహనం చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన వేటగాళ్లు సాయికుమార్, ఎల్లం, గుండెకాయ రాములు, గుండెకాయ నర్సింహులును బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారని తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. వణ్యప్రాణులను వేటాడిన, చంపిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రేంజ్ ఆఫీసర్ సందీప్‌కుమార్, బీట్ ఆఫీసర్లు మల్లేశం, హైమద్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ది రాక్షస పాలనే..

- ప్రజలు ఇంకా మర్చిపోలేదు
- మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ హయాంలోని రాక్షస పాలనను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం పట్టణంలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో కేవలం వారి నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలను అందించారని విమర్శించారు. గత పాలకులు తెలంగాణ ఉద్యమకారులను పక్కన పెట్టారని, అందులో పాల్గొనని వారికి అన్నింటిలో అవకాశాలిచ్చారని వివరించారు. వారికి తెలంగాణ ప్రజలు రెండోసారి సైతం పట్టం కడితే ఎలాంటి మార్పు రాలేదని, ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం డ్యామ్‌ల రూపకల్పన వల్లే జిల్లాల్లో పంటలు పండుతున్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు అనేక కష్టాలు పడ్డారన్నారు. గత ఎన్నికల్లో పార్టీ గెలిచినా కానీ నాటి కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు రావడంతోనే ఆయన బయటకు వస్తున్నారని విమర్శించారు. గత పాలకులు చేయలేనిది తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో చేసి చూపించామన్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు తమ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా తీసుకు పోయి ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులను, కార్యకర్తలకు సూచించారు. ఎంపీ అభ్యర్థి మధు ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నిర్మలా జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదిగలకు ప్రాధాన్యం ఏదీ?



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు

గజ్వేల్‌రూరల్: లోక్‌సభ సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ వైఖరి సరికాదని, మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ మండిపడ్డారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలకు 3 పార్లమెంటు సీట్లు ఉండగా అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల పట్ల చిన్నచూపు చూస్తూ అన్యాయం చేశారని ఆరోపించారు. 5శాతం జనాభా ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి ఆరు సీట్లు కేటాయించిన రేవంత్‌రెడ్డి 12శాతం జనాభా ఉన్న మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా ద్రోహం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు పాల్గొన్నారు.

80 మందిపై సస్పెన్షన్ వేటు!

- ఇప్పటికే 197 మందికి షోకాజ్‌లు
- ఎన్నికల శిక్షణ విధులకు గైర్హాజరే కారణం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లాలోని సుమారు 80 మంది ప్రభుత్వ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడనున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరందరికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి షోకాజ్‌లు జారీ చేశారు. వేటు పడనున్న వారిలో పలువురు ఉపాధ్యాయులు, ఇతర అధికారులున్నారు. వీరంతా ఎన్నికల విధులకు సంబంధించి నిర్వహిస్తున్న కీలకమైన శిక్షణ తరగతులకు గైర్హాజరయ్యారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయులు, ఆపై క్యాడర్‌లో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు పీఓ (ప్రిసైడింగ్ ఆఫీసర్)లుగా ఎన్నికల విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అలాగే ఎస్‌జీటీలు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు ఓపీఓ (అదర్ పోలింగ్ ఆఫీసర్)లుగా వ్యవహరిస్తారు. వీరికి ఎన్నికల విధుల నిర్వహణపై పలు కీలక శిక్షణలు ఇస్తున్నారు. అయితే కొందరు అధికారులు, ఉద్యోగులు ఈ శిక్షణ తరగతులకు గైర్హాజరయ్యారు. ఇలా గైర్హాజరైన సుమారు 197 మందికి ఎన్నికల అధికారులు షోకాజ్‌లు జారీ చేశారు. సరైన కారణాలు లేకుండా శిక్షణకు గైర్హాజరైన వారిపై సస్పెన్షన్ వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఇటీవల సిద్దిపేట జిల్లాలో 106 మంది ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఉద్యోగులు.. రాజకీయ పార్టీలు నిర్వహించిన సమావేశానికి హాజరైన వీరందరిపై అక్కడి కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే సదాశివపేటలో మరో ఉద్యోగి సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం కార్యక్రమాల్లో పాల్గొనగా.. ఆయనపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. తాజా వ్యవహారంలో శిక్షణ తరగతులకు గైర్హాజరైన ఉద్యోగులపైనా సస్పెన్షన్ ఆర్డర్లు జారీ చేయాలని నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై కలెక్టరేట్‌లో అధికారులను సంప్రదించగా ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారికి నోటీసులు ఇచ్చామని, సరైన కారణాలు చూపని అధికారులపై సస్పెన్షన్ వేటు పడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత ప్రక్రియ చేపట్టామన్నారు.

కమలంలో తలోదారి

- నేతల మధ్య సమన్వయ లోపం
- అంటీ ముట్టనట్లుగా కీలక నేతలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : లోక్‌సభ ఎన్నికల వేళ కమలం పార్టీలో సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాలో పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన అభ్యర్థులు ఈ లోక్‌సభ ఎన్నికల్లో అంటీ ముట్టనట్లుగా వ్యవహరించడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారుతోంది. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పులిమామిడి రాజు ఈ ఎన్నికల్లో చురుకుగా పాల్గొనడం లేదు. నియోజకవర్గంలో కీలక సమావేశాలు జరుగుతున్నప్పటికీ ఆయన హాజరు కావడం లేదు. ఇటీవల సంగారెడ్డిలోని ఆ పార్టీ బూత్ కమిటీల నాయకులతో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమావేశం నిర్వహించారు. దీనికి కూడా గైర్హాజరు కావడం గమనార్హం. దీంతో సంగారెడ్డి అసెంబ్లీ స్థానంలో ఒక వర్గం ఎంపీ ఎన్నికల్లో క్రియాశీలకంగా పని చేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటు పటాన్‌చెరు అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా నందీశ్వర్‌గౌడ్ పోటీ చేశారు. ఆయన కూడా ఈ లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే పార్టీ కార్యక్రమాలకు దాదాపు దూరంగా ఉంటున్నారు. మెదక్ ఎంపీ స్థానం పరిధిలో పటాన్‌చెరు ఎంతో కీలకమైంది. అన్ని పార్టీలు కూడా పటాన్‌చెరు నియోజకవర్గంపై ప్రత్యేక ఫోకస్ చేస్తుంటాయి. ఇలాంటి నియోజకవర్గంలో నందీశ్వర్‌గౌడ్ బీజేపీ కార్యక్రమాలకు దాదాపు దూరంగా ఉండటం కమలం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న గడీల శ్రీకాంత్‌గౌడ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేశారు. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా చాలా ఏళ్లుగా పనిచేసిన నరేందర్‌రెడ్డి కూడా ఇప్పుడు స్తబ్దుగా ఉంటున్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న ఆయన ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు. ఇలా వచ్చే ఎన్నికల్లో బీజేపీలో ఒక వర్గం అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటు అందోల్ నియోజకవర్గ విషయానికొస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసిన బాబూమోహన్ ఇటీవల పార్టీని వీడి ప్రజాశాంతి పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో కనీసం ఓ సర్పంచ్‌కు గానీ, కౌన్సిలర్‌కు గానీ వచ్చినన్ని ఓట్లు కూడా రాలేదు. పైగా ఆయన కుమారుడే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో ఆయన కూడా పార్టీని వీడినప్పటికీ పెద్దగా నష్టమేమీ లేదనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమైంది. మరోవైపు నారాయణఖేడ్ అభ్యర్థిగా పోటీ చేసిన జనవాడే సంగప్ప పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. ఇక జహీరాబాద్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన రాంచందర్ రాజనర్సింహ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీని వీడారు.

ఎవరికి వారే..

కమలం పార్టీలో ముఖ్యనేతల మధ్య సమన్వయ లోపం నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో ఆ పార్టీ శ్రేణులు రెండు, మూడు వర్గాలుగా విడిపోయారు. ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. బూత్ స్థాయిలో ఆ పార్టీ గట్టి కార్యకర్తలు ఉన్నప్పటికీ ద్వితీయ శ్రేణి నాయకత్వం మాత్రం తలోదారి అన్నట్లుగా వ్యవహరిస్తుంది. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

సంతానం కోసం పుత్రకామేష్టి యాగం


సత్యవీర్ గురూజీ, సువిజ్ఞాన ఆశ్రమం నిర్వాహకుడు

సాక్షి,హైదరాబాద్: నవమితో పాటు పుష్యమీ నక్షత్రం కలిసి వస్తున్న ఈనెల 17న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు సువిజ్ఞాన ఆశ్రమం నిర్వాహకుడు సత్యవీర్ గురూజీ తెలిపారు. మారిన జీవన విధానాలతో సంతానలేమి సమస్యగా మారిన నేపథ్యంలో ప్రత్యేకంగా ఆడ, మగ బిడ్డల సంతానం కలిగేందుకు అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తామని తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న వారు తమ వివరాలను 92488 28666 లేదా 79817 50006 నంబర్లలో నమోదు చేసుకోవాలని సత్యవీర్ గురూజీ కోరారు.

13న యువ గర్జన


నాయకులతో శేఖర్ గౌడ్

దుబ్బాకటౌన్ : మండల కేంద్రంలో వీఆర్‌ఆర్ గార్డెన్స్‌లో 13వ తేదీన నిర్వహిస్తున్న నియోజక వర్గ బీఆర్‌ఎస్ యువగర్జన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి శేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగర్జన కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితోపాటు మెదక్ ఎంపీ అభ్యర్థి పాతూరి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఖలీల్, సురేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

- ప్రేమ విఫలమైందని ఆత్మహత్యాయత్నం

పటాన్‌చెరు టౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన వాణి తన కూతురు స్రవంతి (18) గ్రామంలో ఇంటి పక్కనే ఉండే మల్లేశ్ అనే వ్యక్తిని ప్రేమించిందని తెలియడంతో మందలించి, అనంతరం కుటుంబ సభ్యులు అమీన్‌పూర్ పరిధిలోని శ్రీ కృష్ణదేవరాయ కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. అప్పటి నుంచి స్రవంతి మానసికంగా బాధపడుతూ పిచ్చిగా ప్రవర్తిస్తుంది. స్రవంతి ప్రేమ విఫలమైనందున ఈనెల 8వ తేదీన ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తల్లి వాణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదం

సిద్దిపేటకమాన్ : షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం వడ్డెర కాలనీకి చెందిన మెడోజు నర్సింహ్మాచారి పట్టణంలో 15 నెలలుగా కార్పెంటర్ దుకాణాన్ని నడిపిస్తున్నాడు. బుధవారం ఉదయం దుకాణం తెరిచి ఉగాది పండుగ సందర్భంగా పూజలు చేసి టిఫిన్ చేయడానికి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల వారు గమనించి ఫైర్ సిబ్బందికి, బాధితుడికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, బాధితుడు మంటలార్పారు. ప్రమాదంలో టేకు, కలప, ఇంటి నిర్మాణం కోసం తయారు చేసిన తలుపులు, యంత్ర సామగ్రి కాలిపోయాయి. రూ.6 లక్షల నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయాడు.

గుట్టుగా బెట్టింగ్

క్రికెట్‌పై ఆన్‌లైన్‌లో యథేచ్ఛగా దందా



- పట్టణాల నుంచి పల్లె వరకు విస్తరణ
- ఆకర్షితులవుతున్న యువత
- అప్పులపాలై ఆస్తులు అమ్ముకుంటున్న వైనం
- నిఘా పెంచిన పోలీసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : శ్రమ లేకుండా తక్కువ సమయంలో లక్షాధికారులు కావాలన్న అత్యాశకు పోయి యువత క్రికెట్ బెట్టింగ్ మోజులో పడుతున్నారు. రూ.వందల్లో మొదలు పెట్టి రూ.వేలు.. రూ.లక్షల దాకా పందెం కాస్తున్నారు. డబ్బులు పోగొట్టుకుని ఆర్థికంగా చితికిపోతున్నాయి. అప్పులపాలై చివరికి కష్టపడి సంపాదించిన ఆస్తులను సైతం అమ్ముకుంటున్నారు. మరికొందరు అప్పులు కట్టలేక రోడ్డున పడుతున్నారు.

ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ జోరుగా నడుస్తోంది. ప్రతీ ప్రాంతంలోనూ పెద్ద మొత్తంలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. పట్టణాల నుంచి మారుమూల గ్రామాల వరకు బెట్టింగ్ నడుస్తుంది. ఫోర్, సిక్స్, ఔట్, ఏ బంతికి ఎన్ని పరుగులు చేస్తారు..? ఏ ఓవర్‌కు ఎన్ని రన్స్ వస్తాయి...? ఓ జట్టు ఎన్ని పరుగులు చేస్తుంది..? ఏ టీం గెలుస్తుంది? ఏ బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులు చేస్తాడు..? ఇలా మొదటి బంతి నుంచి 20 ఓవర్ల వరకూ మ్యాచ్ ముగిసే వరకూ బెట్టింగ్ జరుగుతూనే ఉంటుంది. ఇప్పటికే దాదాపు సగం మ్యాచ్‌లు పూర్తయ్యాయి.

భారీగా నగదు పట్టివేత..



నాలుగు రోజుల కిందట ఓ క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాను రామచంద్రాపురం పట్టణంలోని బీరంగూడలో రాజేందర్‌నగర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఐపీఎస్ బెట్టింగ్ నడుస్తుందని తెలియడంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, ఒకరు పరారీలో ఉన్నారు. వారి నుంచి రూ.37.84 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పెద్ద చర్చనీయాంశంగా మారింది.

అంతా మొబైల్‌లోనే..

క్రికెట్ బెట్టింగ్ అంత మొబైల్ ఫోన్‌లోనే జరుగుతుంది. ఇందు కోసం అనేక యాప్‌లు ఉన్నాయి. అసలు భూకీ గానీ బెట్టింగ్ నిర్వహించే ఏజెంట్‌లు కానీ బెట్టింగ్ కట్టేవారికి కూడా తెలియదు. భూకీ గానీ ఏజెంట్ గానీ ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకుంటారు. బెట్టింగ్ కట్టే సభ్యులను వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేసుకుంటారు. అక్కడి నుంచి మొదలవుతుంది. అందులోనే బెట్టింగ్ కట్టేవారికి ఎందులో నగదు వేయాలో ఒక అకౌంట్ నంబర్ ఇస్తారు. బెట్టింగ్ కాసేవారు ఆ నగదును అందులో జమ చేయాలి. ఒకవేళ బెట్టింగ్‌లో గెలిస్తే వారికి మరుసటి రోజు వారి ఖాతాలో వచ్చిన డబ్బు జమ అవుతుంది.

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో బెట్టింగ్ జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకోవద్దు. బెట్టింగ్‌లపై నిఘా ఏర్పాటు చేశాం. ఎవరైనా బెట్టింగ్‌లు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి. అదే విధంగా ఫోన్‌లకు వచ్చే గుర్తు తెలియని లింక్‌లు వస్తే వాటిని ఓపెన్ చేయొద్దు. సైబర్ మోసాలకు గురి కావొద్దు

– నర్సింహా రావు, ఏసీపీ, మియాపూర్

బెట్టింగ్‌కు బానిస కావొద్దు

నా వయస్సు 18 ఏళ్లు ఉన్నప్పుడు మిత్రుల ద్వారా సరదాగా మొదలు పెట్టాను. ఇప్పటి వరకు సుమారు రూ.80 లక్షలు పోగొట్టుకున్నాను. దీని వల్ల అప్పులు కూడా అయ్యాయి. కొద్ది రోజులుగా రూ.15 లక్షలు బెట్టింగ్‌లో పోయాయి. వీటినే నేనే ఆదా చేసుకొని ఉంటే ఎన్నో ఆస్తులను సంపాదించే వాడిని. ఎవరూ కూడా డబ్బు మీద ఆశతో బెట్టింగ్‌లకు బానిస కావొద్దు. – ఓ బాధితుడు, బీరంగూడ

ఇంటిని అమ్ముకున్నా

చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. ఓ రోజు మద్యం దుకాణానికి వెళ్తే అక్కడ ఓ వ్యక్తి ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ కడుతున్నాడు. అది చూసి దాని గురించి తెలుసుకున్నా. అతను నా ముందే రూ.2 వేలు బెట్టింగ్ కట్టి రూ.5 వేలు గెలుచుకున్నాడు. దాంతో నాకు ఆశ పెరిగింది. వెంటనే యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఐడీ ఏర్పాటు చేసుకొని బెట్టింగ్ మొదలు పెట్టాను. మొదట రూ.3 వేలు పెడితే రూ.5 వేలు వచ్చాయి. దాంతో అది నాకు వ్యసనంగా మారి అప్పుల పాలయ్యాను. వాటిని తీర్చడం కోసం కష్టపడి కట్టుకున్న ఇంటిని అమ్మేసుకున్నాను. – వినయ్ కుమారు, బీరంగూడ

పేకాట రాయుళ్ల అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన బుధవారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రంలోని ఓ క్లినిక్‌లో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి వెళ్లి రైడ్ చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.34,890 నగదు, 5 మొబైల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


నిర్మాణాలను కూల్చివేయిస్తున్న ఆర్‌ఐ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు. తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయ ప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో కూల్చి వేశారు.

అన్నారంలో..

గుమ్మడిదల మండలంలోని అన్నారం శివారులోని 261 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమించి నిర్మాణాలను బుధవారం పోలీసు బందోబస్తుతో కలిసి తహసీల్దార్ గంగాభవానీ జేసీబీలతో కూల్చి వేయించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత విధానంలోనే రాయితీలు

డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు

సిద్దిపేటరూరల్: దళిత, గిరిజన, అర్హత కలిగిన యువకులందరికీ రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య, పరిశ్రమల కేంద్రం ద్వారా గతంలో మాదిరిగానే పాత పద్ధతిలోనే రాయితీలు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏఓ రెహమాన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా అర్హత కలిగిన దళిత, గిరిజన లబ్ధిదారులకు వాహనాలు గాని, ఇతరత్రా సేవా రంగాలకు సంబంధించిన వాటిని కొనుగోలు చేసిన వెంటనే దరఖాస్తు చేసుకొని రాయితీలు పొందే అవకాశం ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ బాటలోనే దళిత గిరిజనులకు అభివృద్ధి సంక్షేమానికి విరుద్ధంగా మెమో ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రాయితీలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకొని పాత పద్ధతిని అమలు చేసి దళిత గిరిజన లబ్ధిదారులకు రాయితీలు మంజూరు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహరాజ్, జిల్లా కార్యదర్శి బీ.రాజు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 60 గొర్రెలు మృతి

- సమారు రూ.4 లక్షల వరకు నష్టం
- మనూరు మండలంలో ఘటన


మృతి చెందిన గొర్రెల వద్ద బాధితులు, నాయకులు

నారాయణఖేడ్: వీధి కుక్కల దాడిలో 60 గొర్రెలు, గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామ వాసి దత్తుగొండకు చెందిన 6 గొర్రె పిల్లలు, హౌగొండ, బస్‌గొండలకు చెందిన గొర్రెలు 20, సీహెచ్ బసుగొండకు చెందిన 12, శ్రీను గొర్రెలు 8, సీ.బసిగొండకు చెందిన 7 గొర్రె పిల్లలను మేతకు తీసుకెళ్లారు. సాయంత్రంగా మనూరు మండలం బెల్లాపూర్ గ్రామం గల మఠం సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో గొర్రెల మందను జాలి వేసి ఉంచారు. రాత్రి సమయంలో ఊర కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి గొర్రెలు, వాటి పిల్లలు కలిపి 60 జీవాలను చంపాయి. జీవాలపై ఆధారపడి జీవిస్తున్న తాము తీవ్ర ఆర్థిక నష్టానికి గురయ్యామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న గొర్రెలు, మేకల పెపకం దారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బాపు మల్‌శెట్టి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. జరిగిన నష్టం విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సంఘం తాలూకా అధ్యక్షుడు ఓం ప్రకాష్, నాయకులు కృష్ణ, దత్తు గొండ, మాజీ ఎంపీటీసీ బీరుగొండ, పశుసంవర్ధక శాఖ అధికారులు సంగప్ప, శ్రీకాంత్, గ్రామ పెద్దలు భాస్కర్, చింటు, సాయన్న ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో నిండు గర్భిణి మృతి

- అత్తింటివారే చంపేశారు
- మృతురాలి కుటుంబ సభ్యుల ఆరోపణ


నాగలత (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎనిమిది నెలల నిండు గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలం అక్కన్నపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా సాయంపేట మండలం, పత్తిపాక గ్రామానికి చెందిన నాగలత(29)కి అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఎలవేని అశోక్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. రెండేళ్ల కుమారుడు ఉండగా, ప్రస్తుతం నాగలత ఎనిమిది నెలల గర్భిణి. బుధవారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని కనిపించింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి చూడగా మృతి చెందిందని నిర్ధారించారు. ఇదిలా ఉండగా, అత్తింటి వారు కొట్టి చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తండ్రి నకీరబోయిన రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు. మృతదేహాన్ని సిద్దిపేట ఫోరెన్సిస్ ల్యాబ్‌కు తీసుకెళ్లి అక్కడే పోస్టుమార్టం చేయించారు.

డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్య సిబ్బంది వెనక్కి

-'పడకేసిన పల్లె వైద్యం' కథనానికి స్పందన


విధుల్లో చేరిన ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్

సాక్షి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్య సిబ్బందిని వెనక్కి పంపుతూ డీఎంహెచ్ఓ శ్రీరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'పడకేసిన పల్లె వైద్యం' అనే కథనానికి డీఎంహెచ్ఓ స్పందించారు. చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ డిప్యుటేషన్‌పై వెళ్లగా వారిని వెనక్కి పంపారు. స్టాఫ్ నర్సులు అనిత, వనిత, ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్ బుధవారం చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో చేరారు. దీంతో ఇతర వైద్య సిబ్బందికి అదనపు భారం తప్పింది.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసుల అదుపులో వాహన డ్రైవర్

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జహీరాబాద్ నుంచి పిట్లంకు డీసీఎం వాహనంలో 120 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. చిల్వెర ఐబీ చౌరస్తాలో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. డీసీఎం వాహనం డ్రైవర్ పయాజ్‌ను అదుపులోకి తీసుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన కారు

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పటాన్‌చెరు టౌన్: స్కూటీని, కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని ఇసుక బావికి చెందిన మొహ్మద్ ఇర్ఫాన్ (20) డిగ్రీ చదువుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి అదే కాలనీకి చెందిన సాయి చరణ్, మదన్‌లతో కలిసి స్కూటీ పై ఇసుక బావి నుంచి బీరంగూడ కమాన్ వైపు వెళ్తున్నారు. సాయిచరణ్ స్కూటీ నడుపుతున్నాడు. మార్గమధ్యలో మల్లారెడ్డి కాలనీ కమాన్ వద్దకు రాగానే కిష్టారెడ్డిపేట వైపు నుంచి బీరంగూడ కమాన్ వైపు వేగంగా వచ్చిన కారు వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇర్ఫాన్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయి చరణ్, మదన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం బీరంగూడ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం మృతుడు ఇర్ఫాన్ తండ్రి మొహ్మద్ హైదర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య


మల్లేశం మృతదేహం

రాయపోలు(దుబ్బాక): మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలు మండలం రాంసాగర్‌లో చోటు చేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి కథనం మేరకు.. రాంసాగర్ గ్రామానికి చెందిన కిచ్చుగారి మల్లేశం (40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్యాభర్తలకు గొడవ జరిగి ఐదేళ్ల కిందట భార్య ఆత్మహత్య చేసుకుంది. కూతురు వివాహం కాగా.. ఇద్దరు కొడుకులు వేర్వేరు ప్రాంతాల్లో ఉండి పని చేసుకుంటున్నారు. ఉగాది పండుగ నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన పెద్ద కొడుకు నర్సింలు పండుగ రోజు కూడా ఎందుకు మద్యం తాగావని తండ్రిని మందలించాడు. నర్సింలు మంగళవారం రాత్రి వారి పెద్దనాన్న ఇంట్లో నిద్రించేందుకు వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న మల్లేశం ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చిన కొడుకు నర్సింలు విషయాన్ని గమనించి గ్రామస్తులకు తెలిపాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావి వద్ద పూజలు చేస్తుండగా..

ప్రమాదవశాత్తు పడి మాజీ సర్పంచ్ మృతి


సిద్రాంరావు (ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రమాదవశాత్తు బావిలో పడి బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అత్నూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్నూర్ గ్రామానికి చెందిన సిద్రాంరావు (63) ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం వ్యవసాయ బావి వద్ద పూజలు చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. రెండు గంటలు గడిచినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి చూడగా అక్కడ చెప్పులు, పూజ సామగ్రి కనిపించాయి. మెడలో ఉన్న రుద్రాక్షమాలలు నీళ్లపై తేలియాడుతూ కనిపించాయి. బావిలో పడి ఉంటాడని గుర్తించి గాలించగా సుమారు ఐదు గంటల తర్వాత మృతదేహం లభ్యమైంది. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. సిద్రాంరావు 1981 నుంచి 1994 వరకు సుమారు 14 ఏళ్ల పాటు గ్రామ సర్పంచ్‌గా, 2001 నుంచి 2006 వరకు ఎంపీటీసీగా పని చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి
- మరో యువకుడికి గాయాలు


సందీప్‌రెడ్డి (ఫైల్)


చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు

బెజ్జంకి(సిద్దిపేట) : కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందగా, మరో యువకుడికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బెజ్జంకి మండలం గూడెం గ్రామానికి చెందిన హన్మండ్ల సందీప్‌రెడ్డి (29) హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వర్క్ ఫ్రమ్ హోం కావడంతో ప్రస్తుతం ఇంటి దగ్గర నుంచే విధులు నిర్వహిస్తున్నాడు. తన మిత్రుడు మండలంలోని వడ్లూరు గ్రామానికి చెందిన రాజుతో కలిసి కారులో లక్ష్మీపూర్‌లో మిత్రులను కలిసేందుకు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి బేగంపేట శివారులోని రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సందీప్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన రాజును కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

పెళ్లి సంబంధాలు చూస్తున్న క్రమంలోనే..

మృతుడి తండ్రి రామచంద్రారెడ్డి సుమారు 20 ఏళ్లుగా గల్ఫ్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగైదేళ్లకు ఒకసారి స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. 10 ఏళ్ల కిందట కూతురి వివాహం జరిపించాడు. కుమారుడు సందీప్‌రెడ్డికి వివాహం చేయాలని రెండేళ్ల కిందట స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి సంబంధాలు కూడా చూస్తున్నాడు. ఈ క్రమంలో 6 నెలల కిందట సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం వచ్చింది. కానీ ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో కుటుంబీకులకు తీరనిశోకం మిగిలింది.

అతిథులొచ్చారు.. అల్లుకున్నారు









విదేశీ విహంగాలైన సైబీరియన్ కొంగలు ఖండాంతరాలు దాటి సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని పెద్ద చెరువును విడిదిగా మార్చున్నాయి. వచ్చే వర్షాకాలం వరకు ఇక్కడే ఉండి గూళ్లు కట్టుకొని ఆహార అన్వేషణతోపాటు సంతతిని పెంచుకుంటాయి. తిరిగి తమ తమ దేశాలకు సామూహికంగా వెళ్లిపోనున్నాయి. మిరుదొడ్డిలోని పెద్ద చెరువుతోపాటు కూడవెల్లి వాగు పరిసరాల్లో గుడ్లు పెట్టి పొదగడానికి దృఢమైన పక్షి గూళ్లను ఏర్పాటు చేసుకున్నాయి. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు అడుగంటుతున్న క్రమంలో చేపలను, పురుగులను వేటాడి తింటున్నాయి. ఈ అందమైన కొంగల విహంగాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– మిరుదొడ్డి(దుబ్బాక)